కేసీఆర్‌కు న్యూఇయర్ విషెస్

శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



ఎర్రవల్లిలోని నివాసంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు తీసుకున్నారు.

- హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ)

రైతుభరోసాకు మళ్లీ దరఖాస్తు అసంబద్ధం

రైతుసంఘం నేతలు పోతినేని, సాగర్

హైదరాబాద్, జనవరి 3 (నమస్తేతెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అమలు కోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలనడం అసంబద్ధ నిర్ణయమని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి టీ సాగర్ పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వెలువడుతున్న చైతన్యసిద్యం రైతుల మాసపత్రిక 2025 డెర్రీని శుక్రవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. యాసంగి రైతుభరోసాను ఒకవైపు సంక్రాంతికి ఇస్తామని చెప్తూ మరోవైపు క్యాబినెట్ కమిటీ ఈ నెల 5,6,7 తేదీల్లో రైతుల నుంచి దరఖాస్తులు చేసుకున్న వారికే వర్తింపజేస్తామని నిర్ణయించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గ్రామసభలు జరిపి వాస్తవ సాగుదారులను నమోదుచేసి వారందరికీ రైతు భరోసా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, తదితరులున్నారు.

లోకం పోకడ

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి,ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యేలు

రైతుబంధుకు రాం రాం!

> రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీలిచ్చిండ్రు. ఇప్పుడేమో రైతుబంధు కోసం రైతులు ప్రమాణపత్రం ఇవ్వాల్నట! ఇంతకంటే చిత్రమైన ముచ్చట వినలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన, అభయహస్తం కింద అన్ని వర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇండ్ల కోసం కోటీ 6 లక్షల మంది దరఖాస్తులు పెట్టుకున్నరు. మరి ఈ సమాచారం ప్రభుత్వం దగ్గర ఉండాలె కదా? అవి ఎటు పోయినయ్? ఇప్పుడెందుకు కొత్తగా రైతులను ప్రమాణ పత్రాలు అడుగుతున్నరు?
> -కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

రైతులు, రైతు కూలీలు ఎంత మంది ఉన్నారో బయటపెట్టు. రైతు వేదిక వద్ద లిస్టుపెట్టు. రూ.22 వేల కోట్ల రైతుబంధు నిధులు ఎక్కడ పక్కదారి పట్టినవో చెప్పు. ఏ రైతు, ఏ లబ్ధిదారుడు అక్రమంగా పొందాడో, ప్రతి ఊరిలో ఇందుకు సంబంధించిన లిస్టు పెట్టు. రైతులను దొంగలుగా చిత్రీకరిస్తే ఊరుకోబోం. మంత్రిమండలిలో రైతుబంధుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలి. రైతుల పక్షాన ప్రభుత్వం మెడలు వంచేందుకు రెండు మూడురోజుల్లో తదుపరి కార్యాచరణ ప్రకటిస్తం' అని హెచ్చరించారు. తెలంగాణభవన్‌లో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, పద్మాదేవేందర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి కేటీఆర్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ వచ్చాక ప్రజాపాలన పేరిట కోటీ 6 లక్షల మంది నుంచి దరఖాస్తులు స్వీకరించిందని, ఈ సమాచారం అంతా ప్రభుత్వం వద్ద ఉన్నప్పుడు కొత్తగా రైతుల నుంచి ఎందుకు ప్రమాణ పత్రాలు అడుగుతున్నారని కేటీఆర్ ప్రశ్నించారు.

మేము జమచేసిన డబ్బులే

'ఎన్నికల్లో చెప్పకున్నా, హామీ ఇవ్వకున్నా రైతుల కోసం కేసీఆర్ రైతుబంధును అమలుచేశారు. రైతుకు పెట్టుబడి సాయం ఇచ్చిన ఏకైక నాయకుడు దేశ చరిత్రలో కేసీఆర్ ఒక్కరే. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండా, ఎలాంటి దరఖాస్తులు తీసుకోకుండా రైతుబంధు అందించాం. 11 సీజన్లలో రూ.73 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. 12వ సీజన్‌లో రైతులకు ఇవ్వాల్సిన డబ్బు సిద్ధంగా పెట్టాం. కానీ, ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ ఉత్తరం రాసి ఆపించింది. సంవత్సరం దాటిపోయినా ఇప్పుడు రూపాయి కూడా రైతుభరోసా రూపంలో రైతులకు ఇవ్వలేదు. ఆ రోజు మేము జమచేసిన రూ.7,500 కోట్లనే రైతు భరోసా పేరుతో ఇచ్చారు' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కేసీఆర్ ఫొటో పజిల్‌ను పూర్తిచేస్తున్న ఉపాసన

వండర్‌కిడ్ ఉపాసనకు కేటీఆర్ అభినందన

రెండున్నరేండ్ల చిన్నారి ఉపాసన ప్రతిభకు కేటీఆర్ అచ్చెరువొందారు. అద్భుత జ్ఞాపకశక్తితో ప్రపంచ రికార్డులను నెలకొల్పి అందరి ప్రశంసలు అందుకుంటున్న తీరుకు ముచ్చటపడ్డారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన వండర్ కిడ్ ఉపాసన, ఆ చిన్నారి తల్లిదండ్రులు అనూష, శివప్రసాద్ శ్రీరంగం శుక్రవారం హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో కేటీఆర్‌ను కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉపాసన తన అద్భుత జ్ఞాపకశక్తి, ప్రతిభాపాటవాలతో నోట్‌బుక్ ఆఫ్ రికార్డ్స్, సూపర్ టాలెంటెడ్ వరల్డ్ రికార్డ్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నది. కేటీఆర్‌ను కలిసిన సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫొటోను తెలంగాణ పటం పజిల్‌గా అతివేగంగా పూరించి 'ఔరా' అనిపించింది. కేటీఆర్ తాతను కలిసి మాట్లాడుతానంటూ ఉపాసన తన ఆకాంక్షను వ్యక్తంచేసింది. ఉపాసన భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ఉపాసన సాధించిన రికార్డుల పత్రాలపైన ఆ చిన్నారి తల్లిదండ్రులు కేటీఆర్ సంతకాన్ని జ్ఞాపకంగా తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వై సతీశ్‌రెడ్డి, రాకేశ్ పాల్గొన్నారు.

ఎకరానికి 15 వేలు ఏవీ?

'ఎన్నికల ముందు వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్‌గాంధీని తీసుకొచ్చి రైతులను ఉద్ధరిస్తామని కాంగ్రెస్ పార్టీ పోజులు కొట్టింది. ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇస్తామని చెప్పింది. కౌలు రైతులకు, రైతు కూలీలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని ప్రకటించింది. వ్యవసాయ రంగానికి అనేక హామీలిచ్చింది. ఇప్పుడు రైతులతో మళ్లీ ప్రమాణపత్రాలు తీసుకోవడం సిగ్గుచేటు..వాన కాలం పంట పెట్టుబడి ఎగ్గొట్టారు. వదిలిపెట్టం' అని కేటీఆర్ హెచ్చరించారు. ప్రమాణ పత్రాల పేరుతో రైతులపై ప్రభుత్వం కేసులు పెట్టాలని చూస్తున్నదని విమర్శించారు. ప్రజల సొమ్మును రైతులు తింటున్నారన్న దుష్ప్రచారాన్ని ఆపాలని, రైతులను దొంగలుగా చిత్రీకరించి ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. హామీలు అమలుచేసే సత్తా లేకుంటే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. గతంలో ప్రధాని మోదీ సైతం తన తప్పును తెలుసుకొని రైతులకు క్షమాపణ చెప్పారని గుర్తుచేశారు.

> ప్రభుత్వానికి దమ్ముంటే గ్రామగ్రామాన రైతుభరోసా లబ్ధిదారుల జాబితా పెట్టాలి. గ్రామాల్లో కౌలు రైతులకు, రైతు కూలీలకు ఏ విధంగా రైతుబంధు ఇస్తదో కాంగ్రెస్ ప్రభుత్వమే సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి. గతంలో మా ప్రభుత్వం రైతులే శాసించేలా చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వారిని యాచించే దుస్థితికి తెచ్చింది. మేము రైతును రాజుగా చేస్తే ఈ ప్రభుత్వం వారిని బిచ్చగాళ్లుగా తయారు చేస్తున్నది.
> -కేటీఆర్

ఎక్కడ దుర్వినియోగమైందో చెప్పండి

'కేసీఆర్ ఆనవాళ్లను లేకుండా చేస్తానని చెప్పినట్టే.. రేవంత్‌రెడ్డి రైతుబంధును కూడా మింగేస్తాడని రైతులు గ్రహించాలి. రైతుబంధులో రూ.22 వేల కోట్లు పక్కదారి పట్టాయని సీఎం, అధికారులు బద్నాం చేస్తున్నరు. మరి రూ.22 వేల కోట్లు ఎవరి ఖాతాల్లోకి పోయాయో ప్రజలకు తెలియాలి. దమ్ముంటే ఏ ఊర్లో ఎంత మేర రైతుబంధు దుర్వినియోగమైంది. గ్రామ గ్రామాన జాబితా ప్రచురించాలి. రైతుబంధు దుర్వినియోగం చేసిన రైతుల పేర్లను కూడా పెట్టండి. అప్పుడు తెలుస్తది నిజంగానే కాంగ్రెస్ చెప్పింది అబద్ధమా? నిజమా? ఇసాబ్.. కితాబ్ మొత్తం తేలుస్తరు. కేవలం రైతులను ప్రజల ముందు పలుచన చేసే కుట్ర చేస్తున్నది' అని కేటీఆర్ మండిపడ్డారు. 'పత్తి, కంది, చెరుకు, పసుపు వంటివి ఏటా రెండుసార్లు పండవు. అయినా ఆయా రైతులకు, పంట్ల తోటల రైతులకు రైతుబంధు ఇచ్చినం. రైతుబంధు దుబారా అయిందని ఈ ప్రభుత్వం అడ్డగోలు అబద్ధాలు ఆడుతున్నది. ఇది పచ్చి దొంగ మాట. రైతు మంచిగా ఉండాలనే ఉద్దేశంతోనే నాడు రెండో పంట కింద పసుపు, కంది, చెరుకు రైతులకు కూడా రైతుబంధు వేశాం. ఇప్పుడు అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారంటే రైతుబంధుకు బొందపెట్టడమే ప్రభుత్వ ఉద్దేశంలా కనిపిస్తున్నది. ఇప్పటిదాకా కొన్న పంట వివరాలు, ఇచ్చిన బోనస్ వివరాలను గ్రామంలో పెట్టాలి' అని డిమాండ్ చేశారు.

ఊరూరా నిలదీయండి

'రైతన్నలూ ఈ ప్రభుత్వాన్ని నిలదీయండి. ప్రజాపాలనలో దరఖాస్తు ఇచ్చినం.. మళ్లీ ప్రమాణపత్రం ఎందుకని నిలదీయండి. 70 లక్షల ఖాతాలు నీ దగ్గర ఉన్నయి.. పొలం వివరాలు అన్నీ తెలుసు.. తెలివి ఈ ప్రయత్నం చేస్తున్నావంటే కటింగ్ పెట్టేందుకు ప్లాన్ చేస్తున్నవ్.. కాబట్టి రైతులు ఊరూరా కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీయాలి. ఊరికి వచ్చే అధికారులను అడగండి' అని కేటీఆర్ పిలుపునిచ్చారు. 'వరంగల్ రైతు డిక్లరేషన్‌ను సంపూర్ణంగా అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దాం. రాష్ట్రంలోని 22 లక్షల కౌలు రైతులకు రేవంత్‌రెడ్డి నాడు ఉత్తరం రాశారు. నేడు రైతుబంధు, రైతు భరోసాను కుదించే కుట్రను ఖండిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మాపై ఉన్నది. రేపటి నుంచి పలు రకాల కార్యక్రమాల రూపంలో రైతులను చైతన్యవంతం చేస్తాం. సంక్రాంతిలోగా రైతు భరోసాను అమలుచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం' అని కేటీఆర్ వెల్లడించారు.

బాకీపై ఊరూరా పోస్టర్లు వేస్తాం..

ప్రభుత్వం ఇప్పటికే ఒక్కో రైతుకు ఒక్కో ఎకరానికి రూ.17,500 చొప్పున మొత్తం రైతులకు రూ.26 వేల కోట్లకు పైగా బాకీ పడింది. ప్రభుత్వానికి దమ్ముంటే రైతులకు ఇచ్చిన డబ్బుల విషయంపై ప్రమాణ పత్రాలు ఇవ్వాలి. మేము రూపాయి దుర్వినియోగం కాకుండా కోటీ 52 లక్షల మందికి రైతుబంధు వేసినం. రైతులకు ఇవ్వాల్సిన బాకీ పోస్టర్లను ఊరూరా అంటిస్తాం' అని కేటీఆర్ హెచ్చరించారు.

ఊరు దాటితే టోల్ తీసుడే!

మొదటిపేజీ తరువాయి...

వచ్చిన విధానమే హ్యామ్. ఈ విధానంలో రోడ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చులో ప్రభుత్వం 40 శాతం ఖర్చు భరిస్తే.. ప్రైవేట్ కంపెనీలు 60 శాతం భరించాల్సి ఉంటుంది. రోడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రైవేట్ కంపెనీలు టోల్ గేట్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తాయి.

గ్రామాల్లోనూ టోల్‌గేట్లు?

హ్యామ్ విధానాన్ని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) కొన్నేండ్లుగా అమలు చేస్తున్నది. ఢిల్లీ-మీరట్ ఎక్స్‌ప్రెస్ వే, పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వే వంటివి హ్యామ్ విధానంలోనే నిర్మించారు. నాగ్‌పూర్-ముంబై సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వే, లక్నో-అయోధ్య ఎక్స్‌ప్రెస్ వే, రాయ్‌పూర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌వే ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. హైవేలకే పరిమితమైన ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు గ్రామాలకు విస్తరించాలని నిర్ణయించింది. తద్వారా ప్రస్తుతం రాష్ట్ర రహదారులకే పరిమితమైన టోల్‌గేట్లు సమీప భవిష్యత్తులో గ్రామాల్లోనూ వస్తాయని చెప్పున్నారు. మూడేండ్లలో రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. అంటే.. 2028 నుంచి ఊరు దాటాలంటే ట్యాక్స్ కట్టాల్సి వస్తుందన్నమాట!

హ్యామ్ విధానంలో రోడ్లు

1000 కోట్లతో గ్రామీణ రోడ్ల నిర్మాణం

మూడేండ్లలో పూర్తికి సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో హైబ్రీడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్)లో ఆర్ అండ్‌బీ పరిధిలో 12 వేల కిలోమీటర్లు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 17,700 కిలోమీటర్ల రోడ్లు నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మూడేండ్లలో నిర్మాణం పూర్తికావాలని చెప్పారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు, హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణంపై సచివాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రూ. వెయ్యి కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఇకపై నెలకు రూ.150 కోట్ల చొప్పున జూన్ వరకు రూ.వెయ్యి కోట్లు విడుదల చేయాలని ఆర్థికశాఖకు సూచించారు. మారుమూల పల్లెల్లోనూ కార్లు, ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాలు తిరుగుతున్న నేపథ్యంలో రహదారుల కొలతలను పునర్నిర్వచించాల్సి ఉన్నదని, వాటి రాకపోకలకు వీలుగా రోడ్లు విస్తరించాలని సూచించారు. ప్రతి పంచాయతీకి బీటీ రోడ్డు ఉండాలని స్పష్టంచేశారు. గ్రామాల నుంచి మండలాలకు సింగిల్‌రోడ్లు, మండలాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లు కచ్చితంగా ఉండాలని చెప్పారు. గుంతలు పడ్డ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణంలో ఒకే నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి సంబంధించి భూ సేకరణను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు పరిహారం నిర్ణయించే విషయంలో ఉదారంగా వ్యవహరించాలని చెప్పారు. నాగ్‌పూర్-విజయవాడ (ఎన్‌హెచ్ -163జీ) రహదారి, ఆర్మూర్ -జగిత్యాల -మంచిర్యాల రహదారి (ఎన్ హెచ్ -63), జగిత్యాల -కరీంనగర్ (ఎన్ హెచ్ 563) రహదారుల భూసేకరణపైనా చర్చించారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క , కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.



జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేట సహకార సంఘంలో యూరియా బస్తాల టోకెన్ల కోసం ఎగబడుతున్న రైతులు

యూరియా కోసం రైతుల ఇక్కట్లు

- **బస్తాల కోసం తప్పని నిరీక్షణ**

కథలాపూర్/బయ్యారం, జనవరి 3 : జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలో రైతులు యూరియా బస్తాల కోసం ఇక్కట్లు పడుతున్నారు. వరి, మక్క జొన్న పంటల సాగుకు యూరియా అవసరం కాగా, 20 రోజులుగా రాకపోవడంతో నిరీక్షిస్తున్నారు. మండలంలోని భూషణరావుపేట, చింతకుంట గ్రామాల రైతులు యూరియా కోసం మూడు వారాలుగా ఎదురు చూడగా, శుక్రవారం 450 యూరియా బస్తాలు భూషణరావుపేట సహకార సంఘానికి వచ్చాయి. దీంతో రైతులు టోకెన్ల కోసం పోటీపడ్డారు. పలువురికి టోకెన్లు అందలేదు. దీనిపై బాధ్యులను వివరణ కోరగా శనివారం ఒక్కో పాస్‌బుక్‌కు ఐదు చొప్పున పంపిణీ చేస్తామని, రైతులు ఎక్కువగా వస్తే నాలుగు ఇస్తామని చెప్పారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం సహకార పరపతి సంఘంలో సర్వర్ పనిచేయకపోవడంతో యూరియా పంపిణీకి ఆటంకం ఏర్పడింది.

- **భారత్‌మాల హైవే పనుల అడ్డగింత**

జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళికి సమీపంలో శుక్రవారం భారత్‌మాల హైవే పనులను రైతులు అడ్డగించారు. భూమి విలువ పెంచి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఏఐతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

వణుకుతున్న తెలంగాణ

రాష్ట్రమంతటా ఈశాన్య గాలుల ప్రభావం

తగ్గిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, జనవరి 3 (నమస్తేతెలంగాణ): తెలంగాణలో ఈశాన్యగాలుల ప్రభావంతో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతున్నది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు చలితో వణికిపోతున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో మరింతగా చలిప్రభావం చూపుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా సగటున కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదు అవుతున్నట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉన్నది. ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 12.8 డిగ్రీల నుంచి 7.2 డిగ్రీలకు పడిపోయింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలకు రెండు రోజులపాటు ఎల్లో అలర్ట్ జారీచేశారు. హైదరాబాద్ నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నట్టు తెలిపింది. వివిధ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. రాష్ట్రంలో అత్యల్పంగా కుమ్రంభీం జిల్లా సిర్పూర్ (యూ)లో, గిన్నెదారిలో 6.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఆదిలాబాద్‌లో చలిమంట కాగుతున్న స్థానికులు

హైదరాబాద్‌లో మాట్లాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు కిరణ్‌కుమార్

రైతు కూలీల హామీలు నెరవేర్చాలి

2011 చట్టప్రకారం కౌలురైతులను గుర్తించాలి • సాగు భూములకే రైతుభరోసా ఇస్తే తీవ్రనష్టం

రైతులు అఫిడవిట్లు సమర్పించాలనడం విడ్డూరం • సంయుక్త కిసాన్‌మోర్చా నేతల డిమాండ్

హైదరాబాద్, జనవరి 3 (నమస్తేతెలంగాణ): రైతు కూలీలు, కౌలు రైతులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. విధి విధానాలు రూపొందించకుండా కౌలురైతులకు రూ.12వేల సాయం అందిస్తామని చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు. సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే 2011 చట్ట ప్రకారం కౌలు రైతులను గుర్తించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంయుక్త కిసాన్‌మోర్చా నాయకుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. గతేడాది సెప్టెంబర్ 13న పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్‌రెడ్డి రాసిన కౌలురైతులకు బహిరంగలేఖ, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల కార్డును ప్రదర్శించారు. రైతుభరోసాపై వేసిన క్యాబినెట్ సబ్‌కమిటీ నివేదికను చూస్తే రైతు కూలీలకు ఒరిగేదేమీ లేదనే విషయం అర్థమవుతున్నదని మండిపడ్డారు. రైతుకూలీ సంఘాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. కౌలురైతులకు సాయం కోసం భూ యజమానుల నుంచి అఫిడవిట్లు తేవాలనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సాగు భూములకే రైతుభరోసా ఇస్తామంటున్న సర్కారు సాగుదారులను విస్మరించేందుకు కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. సమావేశంలో పశ్య పద్మ, టీ సాగర్, కిరణ్‌కుమార్, బీ కొండల్, కన్నెగంటి రవి, పశ్య పద్మ, ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, జక్కుల వెంకటయ్య, కే ప్రసాద్, శంకర్, కల్పన పాల్గొన్నారు.

లగచర్ల కేసులో పోలీస్ కస్టడీకి సురేశ్

3 రోజులపాటు అప్పగించిన ప్రత్యేక కోర్టు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 3 (నమస్తే తెలంగాణ): లగచర్ల రైతులపై నమోదైన కేసులో రిమాండ్ ఖైదీగా కొనసాగుతున్న రెండో నిందితుడు సురేశ్‌ను విచారణ నిమిత్తం 3 రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ప్రత్యేక కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సురేశ్‌ను న్యాయవాది సమక్షంలోనే ప్రశ్నించాలని, ఆయనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించరాదని ఆదేశించింది. దీంతో శనివారం నుంచి సోమవారం వరకు సురేశ్‌ను ప్రశ్నించనున్న బొంరాస్‌పేట పోలీసులు.. కస్టడీ గడువు ముగియగానే ఆయనకు ఉస్మానియా దవాఖానలో వైద్య పరీక్షలు నిర్వహించి, కోర్టు ఎదుట హాజరుపర్చాల్సి ఉన్నది.

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

ఆటో డ్రైవర్ తలారి బాల్‌నర్సయ్య (ఫైల్)

కొమురవెల్లి, జనవరి 3 : ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం మర్రిముచ్చాలలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు వివరాల ప్రకారం.. మర్రిముచ్చాలకు చెందిన తలారి బాల్‌నర్సయ్య 15 ఏండ్ల నుంచి ఆటో నడుపుతూ జీవనం గడుపుతున్నాడు. అంతంతమాత్రంగానే ఆదాయం వస్తుండడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన బాల్‌నర్సయ్య శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. మృతుడి కుమారుడు హరీశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు కొమురవెల్లి ఎస్సై రాజు తెలిపారు.